జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 63॥ గురువారం ॥ 30-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

30 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి పాడ్యమి రా. 9:27 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం శ్రవణ సా. 5:32 వరకు తరువాత ధనిష్ఠ యోగం ఆయుష్మాన్ రా. 12:02o వరకు కరణం భాలవ ఉ. 8:49 వరకు కౌలవ రా. 9:27 వరకు వర్జ్యం రా. 10:00 నుండి రా. 11:43 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:21 నుండి సా. 4:12 వరకు రాహుకాలం మ. 1:58 నుండి మ. 3:34 వరకు యమగండం తె. 5:58 నుండి ఉ. 7:34 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు ఉ. 6:24 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

### "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

### తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు.

అమరావతి, జులై 29: అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.



## ఏఐ మానవ సృజనాత్మకతను పెంపొందించేదిగా ఉండాలి

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా

కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవ సృజనాత్మకతకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానిని మరింత మెరుగుపరిచే సాధనంగా ఉండాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు.

హైదరాబాద్, జూలై 29 (మన దీపం): బుధవారం తొలిసారిగా హైదరాబాద్‌లోని దూరదర్శన్ కేంద్రాన్ని సందర్శించిన గవర్నర్‌కు కేంద్రం ఇంజినీరింగ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ ఆఫ్ కేంద్ర ఎన్.వి. రమణ, న్యూస్ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ గౌలికర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రజలకు విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో దూరదర్శన్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. సాంకేతిక పురోగతిని స్వీకరిస్తూనే నాణ్యమైన, అర్థవంతమైన, సృజనాత్మక కార్యక్రమాల రూపకల్పనకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం "నషా ముక్త్ భారత్" (మత్తు పదార్థాల రహిత భారత్) కార్యక్రమంపై దూరదర్శన్ కోసం గవర్నర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా (మిగతా 2వ పేజీలో)



## స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ

### అత్యాధునిక పరిశ్రమలకు తెలంగాణ ప్రోత్సాహం
### విక్రమ్-1 విజయంపై ముఖ్యమంత్రికి వివరాలు
### అంతరిక్ష రంగంలో సహకార అవకాశాలపై చర్చ
### స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి మద్దతు

అత్యాధునిక సాంకేతిక పరిశ్రములు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి భరత్ డాకా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ కార్యకలాపాలు, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను వివరించారు.

ఢిల్లీ, జూలై 29 : ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగ అభివృద్ధిపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి. సమావేశంలో స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధులు భారతదేశంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-తరగతి ప్రయోగ వాహనం "విక్రమ్-1"ను విజయవంతంగా ప్రయోగించిన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. దేశ అంతరిక్ష రంగానికి ఇది చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాలపై (మిగతా 2వ పేజీలో)



## కృష్ణా, తుంగభద్ర జలాల అంశాలపై డీకే శివకుమార్‌తో ఉత్తమ్ భేటీ

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం న్యూఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి అంతర్‌రాష్ట్ర నదీ జలాల అంశాలపై కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కూడా పాల్గొన్నారు. కృష్ణా, తుంగభద్ర నదుల జలాల కేటాయింపు, నిర్వహణకు సంబంధించిన పలు ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. రెండు పొరుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న జలాల పంపిణీ, నిర్వహణకు సంబంధించిన సమస్యలకు పరస్పర అంగీకారంతో పరిష్కార మార్గాలను అన్వేషించే దిశగా ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.



## యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా సీఎస్ సంజయ్ జాజు ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, జూలై 29 (మన దీపం): తెలంగాణ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, ఇటీవల ఏర్పాటు చేసిన దేవస్థానం ట్రస్ట్ బోర్డులో ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా సంజయ్ జాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి (మిగతా 2వ పేజీలో)




## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా కార్యాచరణ సిద్ధం

### భట్టి విక్రమార్క

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని, ఇకపై క్షేత్రస్థాయిలో అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

హైదరాబాద్, జూలై 29 (మన దీపం): బుధవారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మూడు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నట్లు (మిగతా 2వ పేజీలో)




## తెలంగాణలో 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (TSLPRB) రాష్ట్రంలోని పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF), అగ్నిమాపక శాఖ, జైళ్లు--సవరణ సేవల విభాగాల్లో మొత్తం 7,437 ఖాళీల భర్తీకి బుధవారం నాలుగు వేర్వేరు నియామక నోటిఫికేషన్లు విడుదల చేసింది.

హైదరాబాద్, జూలై 29 (మన దీపం): ఈ నియామకాలలో 200 సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి పోస్టులు, 4,800 పోలీసు కానిస్టేబుల్ పోస్టులు, 1,424 ఎస్‌పీఎఫ్ పోస్టులు, 790 అగ్నిమాపక శాఖ పోస్టులు, 223 జైళ్ల శాఖ పోస్టులు ఉన్నాయి. శాఖల వారీగా ఖాళీలు ఇలా ఉన్నాయి:

పోలీసు శాఖ -- 5,000 పోస్టులు

(మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. నూతన వస్తు,వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో కలుసుకుని విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృషభం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. సోదరులతో భూవివాదాలు కలుగుతాయి. బంధువర్గంతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారమున కొన్ని నిర్ణయాలు నష్టాలు కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం తప్పదు.

మిధునం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

కర్కాటకం: సన్నిహితుల నుండి ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన ధన సహాయం అందుతుంది. సోదరులతో కుటుంబ విషయాల గురించి చర్చిస్తారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభలా బాటలో పయనిస్తాయి. ఉద్యోగమున అధికారులతో వివాదాలు రాజీ అవుతాయి.

కన్య: రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతుంది. ఆత్మీయులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి స్వంత నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తుల పనితీరుకు అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి.

తుల: పాత రుణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచిది కాదు. నిరుద్యోగ యత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగస్తులకు కష్టానికి తగిన ఫలితం అందదు.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాదిక్యాతతో కానీ పూర్తి కావు కొన్ని విషయాలలో సోదరులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. భూ సంబంధిత వివాదాలు కొంత ఒత్తిడి కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నూతన వ్యాపారాలు ప్రారంబానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి పని ఒత్తిడి పెరుగుతుంది.

ధనస్సు: సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుతాయి.

మకరం: సంతాన విద్యా విషయాలపై ద్రుష్టి సారిస్తారు. రాజకీయ వర్గాల ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. భూ సంభందిత క్రయ విక్రయాల లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు.

కుంభం: ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గవరోదాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబసభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకు కలిగిస్తుంది.

మీనం: కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. చేపట్టిన పనులులో వ్యయప్రయాసలు అధికమౌతాయి. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగములు సామాన్యంగా సాగుతాయి.



# స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ



(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆధునిక తయారీ, పరిశోధన-అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని స్కైరూట్ ప్రతినిధులు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య మరింత సమన్వయం పెంచితే ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు. తెలంగాణలో అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాల్లో పెట్టుబడు లు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు, తయారీ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించేలా పారిశ్రామిక విధానాలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో ఉపాధి పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి అభినందించారు. వారు సాధించి న విజయం భారత అంతరిక్ష రంగ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచిందని కొనియా డారు. ఇలాంటి సంస్థలు దేశసాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని, యువ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తు న్నాయన్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# మానవతా విలువల ప్రతిరూపం సినారె

## మందుగుల సుశీల

నల్లగొండ, జూలై 29 (మన దీపం): భావసౌందర్యం, భాషా మాధుర్యం, మానవతా సందేశం, విశ్వదృష్టి కలగలసిన డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) కవిత్వం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని నల్లగొండ జిల్లా తెలుగు ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం కోర్సు డైరెక్టర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి మందుగుల సుశీల అన్నారు. బుధవారం డీవీఎం కళాశాలలోని తెలుగు భాష ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణా కేంద్రంలో సినారె జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సుశీల, తెలంగాణ నుంచి ఇప్పటివరకు జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ఏకైక కవి సినారె అని పేర్కొన్నారు. ఆయన రచనలు మానవీయ విలువలను పెంపొందించడమే కాకుండా సమాజానికి దిశానిర్దేశం చేసే సాహిత్య సంపదగా నిలిచాయని కొనియాడారు. తెలుగు భాషకు, సాహిత్యానికి సినారె చేసిన సేవలు చిరస్మరణీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు శీలం భద్రయ్య, డా. సాగర్ల సత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేశం, డా. కనకటి రామకృష్ణ, పొడిచేటి శంకర్, సాహితీ మేఖల జిల్లా బాధ్యులు మద్దోజు సుధీర్ బాబు, కె. కిషన్, వెంకటేశం మారయ్య, ఎలిజిబెత్, అరుణ, జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు డా. మేక ఉమారెడ్డి, సిలివేరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# వాయుగుండ ప్రభావంతో వర్షాలు

## పలు జిల్లాల్లో జోరుగా వానలు



హైదారాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ):బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమబెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో మూడ్రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. అటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పాలెంలలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, గురు, శుక్రవారాల్లోనూ బలమైన గాలుల కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

ఎల్ నినో కారణంగా జూన్, జూలైలో -49 సెం.మీ లోటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడించాయి. నిరుడు ఇదే సమయానికి 33.3 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా కార్యాచరణ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి తదితర సీనియర్ నాయకులు హాజరయ్యారు.

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారి పనితీరును ఏఐసీసీ సమీక్షించి అభినందించిందన్నారు. మిగిలిన ఓటరు నమోదు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులకు సూచించినట్లు చెప్పారు.

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా సమన్వయ కమిటీ విస్తృతంగా చర్చించిందని తెలిపారు. పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయడంతో పాటు అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఈ ప్రక్రియలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు భట్టి తెలిపారు. ఆయా జిల్లాల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో సంప్రదింపులు జరిపిన అనంతరం ముగ్గురు అభ్యర్థుల పేర్లతో కూడిన ప్యానెల్‌ను పార్టీ అధిష్ఠానానికి సమర్పించాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

ఓటరు నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహం వంటి మూడు ప్రధాన అంశాలపై స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకున్నామని, వాటి అమలుకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఎక్స్అఫిషియో సభ్యుడిగా సీఎస్ సంజయ్ జాజు ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

(ఈఓ) జె. భవానీ శంకర్ ఆయనతో పదవి, గోప్యత ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సంజయ్ జాజు అధికారికంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఎక్స్అఫిషియో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు.

# ఏఐ మానవ సృజనాత్మకతను పెంపొందించేదిగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి పౌరుడు చురుకుగా భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఇంటర్వ్యూను త్వరలో దేశవ్యాప్తంగా ప్రసారం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.అలాగే "ఏక్ పెడ్ మా కె నామ్" కార్యక్రమంలో భాగంగా గవర్నర్ ఒక మొక్కను నాటగా, దూరదర్శన్ కేంద్రం అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గవర్నర్ వెంట రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి కె. శశి కిరణాచార్య కూడా పాల్గొన్నారు.

# తెలంగాణలో 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు -- 148
రిజర్వ్ ఎస్ఐలు (ఏఆర్) -- 14
రిజర్వ్ ఎస్ఐలు (టీజీఎస్పీ) -- 12
రిజర్వ్ ఎస్ఐలు (ఎస్ఏఆర్‌సీపీఎల్) - 3
అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎఫ్‌పీబీ) - 23
సివిల్ పోలీసు కానిస్టేబుళ్లు -- 3,697
ఏఆర్ కానిస్టేబుళ్లు -- 1,052
ఎస్ఏఆర్‌సీపీఎల్ కానిస్టేబుళ్లు -- 24
డ్రైవర్ కానిస్టేబుళ్లు -- 20
మెకానిక్ కానిస్టేబుళ్లు -- 7
స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) -- 1,424 పోస్టులు
సబ్ ఇన్‌స్పెక్టర్లు -- 44
కానిస్టేబుళ్లు -- 1,380
అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ -- 790 పోస్టులు
స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు -- 39
ఫైర్ ఫైటర్లు -- 751
జైళ్లు ఁ సవరణ సేవల శాఖ -- 223 పోస్టులు
డిప్యూటీ జైలర్లు (పురుషులు) -- 14
డిప్యూటీ జైలర్ (మహిళ) -- 1
వార్డర్లు (పురుషులు) -- 196
వార్డర్లు (మహిళలు) -- 12

ఆన్‌లైన్ దరఖాస్తుల షెడ్యూల్‌ను త్వరలో ప్రత్యేకంగా ప్రకటిస్తామని టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెల్లడించింది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు సివిల్ సర్జన్ ద్వారా వైద్య పరీక్షలు చేయించుకుని నిర్దేశిత శారీరక,




వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. అలాగే కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్, నాన్-క్రీమీ లేయర్, స్థానిక అభ్యర్థిత్వం తదితర అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

# శ్వేత సంపాదకీయం

గురువారం 30-7-2026

## పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్పపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు.

కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక  సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్దతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి.  దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

ఈ  కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఒంది.  అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం.

ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది.  జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

# పేపర్ లీక్  నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

**రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం**

**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు**

**ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ**

**పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు**

**యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు**



న్యూఢిల్లీ,జూలై29(ఆర్ఎన్ఎ): లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే దిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉ ంటోంది. ఆఖరికీ వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇకపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వాయుగుండ ప్రభావంతో వర్షాలు

**పలు జిల్లాల్లో జోరుగా వానలు**

హైదారాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ):బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమబెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో మూడ్రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. అటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.  గడిచిన 24 గంటల్లో మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పాలెంలలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ న్నదని, గురు, శుక్రవారాల్లోనూ బలమైన గాలుల  కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్ నినో కారణంగా జూన్, జూలైలో –49 సెం.మీ లోటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడించాయి. నిరుడు ఇదే సమయానికి 33.3 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

## మద్యం కేసులో కారుమూరికి చుక్కెదురు

**ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం**

న్యూఢిల్లీ,జూలై29(ఆర్ఎన్ఎ):ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. నేరం జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఈ కేసులో కస్టోడియల్ దర్యాప్తు అవసరమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏపీ మద్యం కుంభకోణంలో సుమారు రూ.350 కోట్ల ప్రజాధనం దారి మళ్లినట్లు ఆధారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది.ఈ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితుడి విచారణ అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. కస్టోడియల్ దర్యాప్తు లేకుండా పూర్తిస్థాయిలో నిజాలను వెలికితీయడం కష్టమని పేర్కొంది. కారుమూరి నాగేశ్వరరావు తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ కోసం వాదనలు వినిపించినప్పటికీ, సుప్రీంకోర్టు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. దర్యాప్తు సంస్థలకు సహకరించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది.

## జీవ వైవిధ్యంలో పులుల పాత్ర కీలకం

అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంలు తెలిపిన పవన్

అమరావతి,జూలై29(ఆర్ఎన్ఎ):జీవ వైవిధ్య పరిరక్షణలో పులుల పాత్ర అమోఘమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్  వ్యాఖ్యానించారు. అడవుల పరిరక్షణలో భాగస్వాములైన ప్రకృతి ప్రేమికులందరికీ అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పులుల సంరక్షణలో దేశానికే ఆదర్శంగా ఏపీని నిలిపామని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. తూర్పు కనుమల్లో పులుల పునరుజ్జీవం వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. నల్లమలలో పులి గర్జన శాశ్వతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పులి కేవలం మన జాతీయ జంతువు మాత్రమే కాదని, మన దేశ అటవీ సంపదకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అని ఉ ద్ఘాటించారు.



## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారినీ కలసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

**విజయనగరం, జులై 29:** గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన, మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జిఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జిఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రారంభించడం బాగున్నదన్నారు పరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గారు తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీకి షాక్.. వైఎస్సార్‌సీపీలో చేరిన పొన్నూరు నేతలు

**తాడేపల్లి, జూలై 29:** గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు మండవ గౌతమ్, మండవ లక్ష్మీ నీరజ బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గౌతమ్, లక్ష్మీ నీరజలను జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పొన్నూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జగన్ నాయకత్వం, ఆయన విధానాలు, ప్రజల పట్ల నిబద్ధత తమను ఆకర్షించాయని గౌతమ్, లక్ష్మీ నీరజ తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మండవ గౌతమ్ గతంలో పొన్నూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడిగా, బూత్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. సుదీర్ఘకాలం సొసైటీ అధ్యక్షుడిగా, పొన్నూరు మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. మండవ లక్ష్మీ నీరజ టీడీపీ మండల అధ్యక్షురాలిగా పనిచేయడంతో పాటు గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీపై పోటీ చేశారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ నాయకులు గుంటుపల్లి అంజయ్య, వేజండ్ల శివకృష్ణ, నూతలపాటి కృష్ణ, కిలారి రమేష్, త్రిపురనేని వెంకటస్వామి, రావిపాటి పవన్, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అదానీ పోర్ట్స్ లాభం 10 శాతం అప్

**న్యూఢిల్లీ:** దేశీ ప్రైవేటు పోర్ట్స్ దిగ్గజం అదానీ పోర్ట్స్ (ఏపీసెజ్) ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. అంతర్జాతీయ పోర్టుల, మెరైన బిజినెస్‌ల జోరు, దేశీ పోర్టుల స్థిరమైన పనితీరుతో ఈ ఏడాది తొలి త్రైమాసికం (2026--26, క్యూ1)లో కంపెనీ రూ. 3,650 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.3,311 కోట్లతో పోలిస్తే లాభం 10.23 శాతం జంప్ చేసింది. మొత్తం ఆదాయం కూడా 24 శాతం వృద్ధితో రూ. 9,422 కోట్ల నుంచి రూ. 11,674 కోట్లకు ఎగబాకింది. మరోపక్క, కంపెనీ వ్యయాలు రూ.5,732 కోట్ల నుంచి రూ. 7,079 కోట్లకు పెరగడం గమనార్హం. 'అన్ని వ్యాపార విభాగాల్లో ఈ సమతుల్యమైన వృద్ధితో 2031 నాటికి కంపెనీ లక్ష్యాలను సాధించగలమన్న నమ్మకం మరింత బలపడింది. 2030 కల్లా దేశీ పోర్టుల హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని 1,000 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ)కు విస్తరించాలన్న టార్గెట్, అంతర్జాతీయ పోర్ట్‌ఫోలియో వృద్ధి, వేగంగా విస్తరిస్తున్న లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్ దన్నుతో దీర్ఘకాలిక విలువను సృష్టించే సామర్థ్యం గల మరింత వైవిధ్యమైన, స్థిరమైన, ప్రపంచవ్యాప్తంగా అనువైన రవాణా ప్లాట్‌ఫామ్‌ను ఏపీసెజ్ నెలకొల్పుతోంది' అని కంపెనీ సీఈఓ అశ్వని గుప్తా పేర్కొన్నారు. క్యూ1లో అంతర్జాతీయ పోర్టుల నుంచి ఆదాయం 256 శాతం దూసుకెళ్లి రూ. 1,747 కోట్లకు చేరింది. దేశీ పోర్టుల ఆదాయం 12 శాతం వృద్ధి చెందింది. ఇక మెరైన్ వ్యాపార ఆదాయం 67 శాతం ఎగసి రూ. 901 కోట్లను తాకింది. కొత్త ఆఫ్‌షోర్ వెసల్స్ జోడింపు, యూరోపియన్ సబ్‌సీ విస్తరణ దీనికి దోహదం చేశాయి. కాగా, 2026--27 పూర్తి ఏడాదికి అదానీ పోర్ట్స్ రూ. 43,000--45,000 కోట్ల ఆదాయాన్ని, రూ. 25,000--26,000 కోట్ల ఎబిటాను అంచనా వేస్తోంది. జూన్ నాటికి కంపెనీ స్థూల రుణ భారం రూ. 56,776 కోట్లు కాగా, రూ. 12,428 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

# జిల్లా ఆర్థికాభివృద్ధికి జివిఏ--జిడిడిపిపై సమగ్ర అవగాహన అవసరం





### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

### స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలకు నాణ్యమైన గణాంకాలే పునాది

### మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జివిఏ--జిడిడిపిపై అవగాహన పెంపొందించాలి

### శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించాలి

**విజయవాడ:** జూలై 29,2026: జిల్లా ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థూల విలువ జోడింపు, స్థూల జిల్లా దేశీయోత్పత్తి వంటి ఆర్థిక సూచికలపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణలో జిల్లా ఆర్థికాభివృద్ధి, జివిఏ, జిడిడిపి, రంగాల వారీ ఆర్థిక వృద్ధి, జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక గణాంకాల తయారీ, విశ్లేషణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లైన మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్, యంగ్ ప్రొఫెషనల్స్‌కు సమగ్ర అవగాహన కల్పించారు. 2025--26 సంవత్సరానికి జిల్లా జిడిడిపి సుమారు రూ.1,05,135 కోట్లుగా నమోదైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రగతిని అంచనా వేయడంలో జివిఏ, జిడిడిపి వంటి ఆర్థిక సూచికలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖ జివిఏ లెక్కింపు విధానాలు, రంగాల వారీ వృద్ధి, గణాంకాల వినియోగంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే నూరు శాతం అక్షరాస్యత సాధించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తే దాదాపు 95 శాతం ప్రజలను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు సంపూర్ణ నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే కుటుంబాలతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తారని తెలిపారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలతో పాటు విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వరి సాగులోని కొంత భూమిని ఉద్యానవన పంటలకు మళ్లించడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సేవారంగంలో సుమారు రూ.150 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధితో సేవారంగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సహజ, మానవ వనరులు, భౌగోళిక అనుకూలతలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో ఉత్పత్తి పెంపుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని, సేవా, పారిశ్రామిక రంగాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం సైద్ధాంతిక అంశాలకు పరిమితం చేయకుండా పరస్పర చర్చలు, ప్రశ్నోత్తరాలు, ఆచరణాత్మక ఉదాహరణలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయి అధికారులు, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు సిబ్బందికి సమర్థవంతంగా చేరవేయాలని ఆదేశించారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి జివిఏ, జీఎన్‌డీపీ, జిడిడిపి, జీఎస్‌డీపీ వంటి ఆర్థిక భావనలపై క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పించాలని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల అమలులో భాగస్వాములైన ప్రతి స్థాయి అధికారి, సిబ్బందికి ఈ అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండటం అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన గణాంకాల సేకరణ, విశ్లేషణ, వినియోగంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేసి స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక ఃగణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.అనుపమ మాట్లాడుతూ, ప్రతి శాఖ తన పరిధిలోని గణాంక సమాచారాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకతతో, నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాల సాధనలో నాణ్యమైన, విశ్వసనీయ, సమయానుకూల గణాంకాలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలలో రంగాల వారీ జివిఏ పురోగతిని కీలక పనితీరు సూచికల ద్వారా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చోట సకాలంలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పహాలే ఇండియా ఫౌండేషన్ శిక్షకులు జె.అనిల్ కుమార్, బెల్లపు రాగిణి, జోనల్ కోఆర్డినేటర్ యోగేష్ కృష్ణ, జిల్లా విశ్లేషకులు, మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. జిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీ చేయడమైనది



## చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రుల బృందం

**విజయనగరం, జులై 29:** ప్రధాని నరేంద్ర మోడీ గారి సభ సమావేశానికి వచ్చి తిరిగి వెళ్లే ప్రజానీకానికి భోజనాలు ఏర్పాటు చేయడం కోసం చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం మంత్రులు బృందం పరిశీలించారు. మంత్రులు అచ్చం నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, దామచర్ల సత్య, బీద రవిచంద్ర, కిలారు రాజేష్, కోటంరెడ్డి గిరిధర్ గార్లు కలిసి హైవే జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎక్కువ మంది ప్రజలు భోజనాలు చేసేందుకు వీలు కల్పించి తగిన ఏర్పాట్లు చేయటానికి పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది భోజనాలు చేయటానికి వీలు పడుతుందనే అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రుల బృందం, అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

# మీ-సేవను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలి

### ఆగస్టు 15 నాటికి మరిన్ని సేవలు అందుబాటులోకి..

### సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, జూలై 29:** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించేలా మీ-సేవను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతి, శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని సూచించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలు సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికపైకి తీసుకురావాలని, వీలైనన్ని ప్రభుత్వ సేవలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. దీంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సేవలను ఇంటి నుంచే పొందే అవకాశం కల్పించాలని సూచించారు.

**ఏఐ, డేటా ఆధారిత సేవల అనుసంధానం**

ఆధునిక సమాచార సాంకేతికతతో పాటు కృత్రిమ మేధ (ఏఐ), డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించాలని సీఎస్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సంజయ్ జాజు పేర్కొన్నారు. మీ-సేవను దేశానికే ఆదర్శంగా నిలిచే పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరి శెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియాలో తెలంగాణ సత్తా చాటాలి

### క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేయాలి:

### తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 29:** రాబోయే ఖేలో ఇండియా క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించేలా అన్ని క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు, న్యూఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో బుధవారం నిర్వహించిన ఖేలో ఇండియా క్రీడల సన్నాహక సమావేశానికి రాష్ట్రంలోని వివిధ క్రీడా సంఘాల ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులతో కలిసి జితేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల ఎంపికలో ప్రతిభకు పెద్దపీట వేస్తూ పారదర్శక విధానాన్ని పాటించాలని సూచించారు. యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి మెరుగైన శిక్షణ, పోటీ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత క్రీడా సంఘాలపై ఉందన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. ఖేలో ఇండియా వేదికగా తెలంగాణ క్రీడా ప్రతిభను దేశానికి చాటేలా క్రీడా సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎజవీణ సోనిబాల దేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. మల్లారెడ్డి, వివిధ రాష్ట్ర క్రీడా సంఘాల ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు డీపీఆర్‌లకే పరిమితం కాకుండా గ్రౌండింగ్ కావాలి





## జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

### రూ.75 కోట్లతో ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టును జులై-2027 నాటికి అందుబాటులోకి తీసుకురావాలి

### నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో 'విజయవాడ ఉత్సవ్' నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

### ఇబ్రహీంపట్నం పవిత్ర సంఘం వద్ద వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌తో ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టాలి

### పర్యాటక అభివృద్ధితో జిల్లా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది

**విజయవాడ: జులై 29,2026:** జిల్లాలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) దశలోనే నిలిచిపోకుండా వేగవంతంగా గ్రౌండింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాకు ఆర్థికంగా, ఉపాధి పరంగా విశేష ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా పర్యాటక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భవానీ ఐలాండ్ వద్ద రూ.75 కోట్ల అంచనా వ్యయంతో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పొందాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డెస్టినేషన్ వెడ్డింగ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, 500 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ హాల్ తదితర ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జులై-2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవానీ ఐలాండ్‌లో అమరావతి బోటింగ్ క్లబ్‌ను పర్యాటకులకు ఆకర్షణీయంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బోటింగ్ కార్యకలాపాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో 75 మంది సామర్థ్యంతో మినీ థియేటర్‌ను పాఠశాల, కళాశాల విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక, అవగాహన చిత్రాల ప్రదర్శనకు వినియోగించాలన్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంఘం వద్ద నదీహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌లో ప్రత్యేక ప్లాట్‌ఫాంను నిర్మించాలని ఆదేశించారు. అలాగే భక్తులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయాలని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాకపోకలకు అనుగుణంగా రోడ్డు అభివృద్ధికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్ అండ్ బి అధికారులు తయారు చేయాలని సూచించారు. నది హారతి సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నందున సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల మధ్య ఆర్టీసీ బస్సులను ఆ రూట్ లో నడపాలని సూచించారు. విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు జల వనరుల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన "విజయవాడ ఉత్సవ్" కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలో పర్యాటక ఆకర్షణగా ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టి తిరిగి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "ప్రసాద్" (Promotion of Religious Tourism and Spiritual Heritage Augmentation Drive) పథకం ద్వారా లభించే నిధులను జిల్లాలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి వినియోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొండపల్లి ఖిల్లాను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రెక్కింగ్, ర్యాపెల్లింగ్ వంటి సాహస క్రీడలకు అవసరమైన బేస్ క్యాంపును జులై 7 నుండి 11 వరకు ఏర్పాటు చేయడంతో పాటు, శాశ్వత టికెటింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి ట్రెక్కింగ్‌కు అవసరమైన సామగ్రిని పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో సమన్వయంతో ముందుకు సాగాలి జిల్లాలో ప్రతిపాదించిన ప్రతి పర్యాటక ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి ద్వారా జిల్లాకు మరింత ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విజయవాడను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వై.వి. ప్రసన్నలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.శిల్ప, జిల్లా అటవీశాఖ అధికారి ఏ.సతీష్, ఏపీటీడీసీ ఈఈ జి.శ్రీనివాసరావు, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం ఏఈఓ ఎన్.రమేష్, ఏఈ రమ, అమరావతి బోటింగ్ ప్రాజెక్ట్ సీఈవో కాకాని తరుణ్, బీఐటీసీ ప్రాజెక్టు ఇంజనీర్ జి.ఉమామహేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# 'సామ్రాజ్యాలు కూలిపోతాయి.. బంగారం నిలుస్తుంది'

ప్రపంచ ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత, ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు రాబర్ట్ కియోసాకి మరోసారి బంగారం, వెండిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ చరిత్రలో ప్రతి సామ్రాజ్యం ఒకే చక్రాన్ని అనుసరిస్తుందని, అధికంగా కరెన్సీ ముద్రించడం చివరికి ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తుందని ఆయన తన ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాగితపు కరెన్సీ కంటే బంగారం, వెండి వంటి వాస్తవ ఆస్తులే సంపదను కాపాడగలవని ఆయన అభిప్రాయపడ్డారు. రోమన్ సామ్రాజ్యం నుంచి స్పెయిన్, బ్రిటన్ వరకు చరిత్రను పరిశీలిస్తే, కరెన్సీ విలువ తగ్గిన ప్రతిసారి బంగారం తన విలువను నిలబెట్టుకుందని కియోసాకి తెలిపారు. ప్రభుత్వాలు ఎంత డబ్బునైనా ముద్రించగలవని, కానీ బంగారం లేదా వెండిని ముద్రించడం సాధ్యం కాదని ఆయన చెప్పారు. అందుకే ధనవంతులు తమ సంపదను బంగారం, వెండి వంటి పరిమిత లభ్యత కలిగిన ఆస్తుల్లో నిల్వ చేస్తారని వివరించారు. ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని క్రమంగా తగ్గిస్తుందని, అలాంటి సమయంలో బంగారం, వెండి కొనుగోలు శక్తిని రక్షించే సాధనాలుగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.

# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా..!








### రైతుల ఆర్థిక భద్రతకు పథకంలో 100 శాతం నమోదు అవసరం..లి

### ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలిలి

### సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జిల్లాలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజారోగ్యం, వరదల నివారణ, రెవెన్యూ సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును తప్పనిసరిగా పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్)పై ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఎంత విస్తీర్ణంలో పంట మార్పిడి చేపట్టారో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ కనీసం రెండు నుంచి మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ (91549 70454)ను సంప్రదించే విధంగా అన్ని ఎరువుల దుకాణాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో సీడ్ పెల్లెటింగ్‌ను ప్రతి రైతుకు విస్తృతంగా అమలు చేయాలని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే కాకుండా అందరికీ వర్తించే సాంకేతిక విధానమని వివరించారు. సీడ్ పెల్లెటింగ్ వల్ల మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో కూడా విత్తనం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు.

**హరిత విస్తీర్ణంపై దృష్టిపెట్టండి:**

నెట్ జీరో' లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మొదట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రారంభించి అనంతరం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విస్తరించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకే బృందంలా పనిచేయాలని, అధికారులు తమ శాఖలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో నిలపడానికి కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత, 22ఏ దరఖాస్తుల పరిష్కారం తదితరాల పైనా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. (సమాచార పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ)





# పార్టీ నియమాలను అనుసరించాలి

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరిక

**విజయనగరం, జులై 29:** తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కూడా పార్టీ నియమాలను అనుసరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు బుధవారం గజపతినగరం నియోజకవర్గ బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 50 కుటుంబాల వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు వలవల బాబ్జి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరు నిబద్ధత పనిచేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. వైసీపీ సీనియర్ నాయకులు కోరాడ సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్ పల్లి సత్యం వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండల రావు గారు, టిడిపి మండల ప్రెసిడెంట్ రాపాక అచ్చం నాయుడు, మాజీ సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, టిడిపి గ్రామ ప్రెసిడెంట్ పెన్నింటి తవుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.ఐ లలో రెండవ విడత అడ్మిషన్లు.....

### జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు

ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చునన్నారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు. (సహాయ సంచాలకులు, రాష్ట్ర సమాచార కేంద్రం, విజయవాడ.)

# ఎస్ఎంఎల్'కు మహీంద్రా ట్రక్‌ల వ్యాపారం

రూ. 525 కోట్ల డీల్ ˇ2031 నాటికి 12,500 కోట్ల ఆదాయం టార్గెట్

ముంబై: ఆటో దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) తమ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ట్రక్కులు, బస్సుల విభాగాన్ని (ఎంటీబీడీ) అనుబంధ సంస్థ ఎస్ఎంఎల్ మహీంద్రాకి బదలాయించనున్నట్లు వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 525 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 7న ఒప్పందాలు (బీటీఏ) కుదుర్చుకోనుండగా, వచ్చే ఏడాది జనవరి నాటికి డీల్ పూర్తి కావచ్చని వివరించింది. పటిష్టమైన బ్రాండ్స్‌తో, విలీన సంస్థ, మార్కెట్లో శక్తివంతమైన పోటీదారుగా ఎదుగుతుందని ఎస్ఎంఎల్ మహీంద్రా చైర్మన్ వినోద్ సహాయ్ చెప్పారు. భవిష్యత్ వృద్ధి అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకుని లెక్కగట్టడం కాకుండా ప్రస్తుత వేల్యుయేషన్‌పై ఎస్ఎంఎల్ షేర్‌హోల్డర్లకు స్పష్టత ఉండేందుకు స్లంప్ సేల్ ప్రాతిపదికన ఈ డీల్ ఉంటుందని ఎంఅండ్ఎం సీఎఫ్‌వో అమర్‌జ్యోతి బారువా చెప్పారు.

**విలీన సంస్థ ఇలా..**

ఎస్ఎంఎల్ మహీంద్రా, ఎంటీబీడీ విలీనతో ఏర్పడే సంస్థవిస్తృత స్థాయి ఉత్పత్తుల శ్రేణితో దేశీయంగా నాలుగో అతి పెద్ద వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజంగా ఎదగనుంది. 2030--31 ఆర్థిక సంవత్సరం నాటికి ఆదాయాలను రూ. 12,500 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల ఆదాయం కలిపి సుమారు రూ. 6,000 కోట్లుగా ఉంటుంది. ఇరు సంస్థలు చేతులు కలపడం వల్ల మార్కెట్ వాటాలో నాలుగో స్థానానికి చేరవచ్చు. ఉమ్మడి వ్యాపారానికి 200 డీలర్‌షిప్‌లు, 650 టచ్‌పాయింట్లు ఉంటాయి.



## క్రోసూరులో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**క్రోసూరు, జూలై 29:** మండల కేంద్రమైన క్రోసూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సాయినాథుడికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అలంకరణలు, మహాభిషేకం, హారతులు మరియు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సాయిబాబాకు ప్రత్యేకంగా పల్లకీ సేవ నిర్వహించగా, క్రోసూరు, అచ్చంపేట మండలాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తుల "శ్రీ సాయి, జయ జయ సాయిరాం" నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. గురువు విశిష్టతను స్మరించుకుంటూ, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, ఆయురారోగ్య సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు బాబావారిని ప్రార్థించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు వేదాశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తుల సహాయ సహకారాలతో పులిహోర, చక్కెర పొంగలి, పరమాన్నం, శనగ గుగ్గిళ్లు, బూంది వంటి ఐదు రకాల ప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మన్నెం వెంకట్రావు మాట్లాడుతూ... క్రోసూరు, అచ్చంపేట మండలాల నుంచి సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి బాబావారిని దర్శించుకున్నారని, ఇంత పెద్ద ఎత్తున భక్తులు రావడం ఎంతో సంతోషకరమని తెలిపారు.



## జన్నతుల్ బఖీ ఖబరస్తాన్‌లో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభం

**విజయవాడ, జూలై 29:** 25వ డివిజన్ అరండల్‌పేటలోని జన్నతుల్ బఖీ ఖబరస్తాన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ బొండా ఉమామహేశ్వరరావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలాంటి వివక్ష లేకుండా అన్ని వర్గాలు, మతాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉందన్నారు. ఖబరస్తాన్‌లో వెలుతురు సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల రాత్రి వేళల్లో వచ్చే వారికి భద్రత, మెరుగైన వసతి లభిస్తుందని పేర్కొంటూ నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖబరస్తాన్, మస్జిద్ కమిటీ ప్రతినిధులు రజాక్, బాషా భాయ్, మహమ్మద్, అమ్జద్, అస్లాం, అన్వర్, డివిజన్ అధ్యక్షులు మాచర్ల గోపి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**పెదకూరపాడు, జులై 29:** ఉపాధి హామీ వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. 'సామాజిక శంఖారావం' కార్యక్రమంలో భాగంగా అందుకూరు, బాలమర్రు గ్రామాల్లో పర్యటించిన ఆయనకు, రెండు నెలలుగా వేతనాలు రాక పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దు చేసి నూతనంగా తీసుకొచ్చిన 'జి.రాంజీ' ఉపాధి హామీ చట్టంలోని నిబంధనల వల్లే వేతనాల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ 40 శాతం వాటా ఇస్తేనే నిధులు విడుదల చేస్తామనడం, ఒకసారి చేసిన పనిని ఐదేళ్ల వరకు మళ్లీ చేపటకూడదనే నిబంధనల వల్ల పనుల గుర్తింపు కష్టమై కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి వెంటనే కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చిలుక యేసయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఇద్దరు వేద విద్యార్థుల దుర్మరణం

**అమరావతి, జూలై 29:** అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలోని వేద పాఠశాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాఠశాలలో చదువుతున్న ఇద్దరు వేద విద్యార్థులు గురువారం పాఠశాల సమీపంలోని చెరువులో పడి ప్రమాదవశాత్తూ మృతి చెందారు. మృతులను రాజమండ్రికి చెందిన బమ్మిడి శివ (18), కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండలం వేములనర్వ గ్రామానికి చెందిన కొడవటి కంతి కిరణ్‌గా గుర్తించారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, పాఠశాల నిర్వాహకులు వీరిని చెరువులో నుంచి బయటకు తీసి అమరావతి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)కి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థుల మృతితో వేద పాఠశాలలోనూ, మృతుల స్వగ్రామాల్లోనూ తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి.

# కేంద్ర సహకారంతో ఇంద్రకీలాద్రికి అంతర్జాతీయ శోభ

### లోక్‌సభలో 'నియమం-377' కింద ఆలయ అభివృద్ధిపై ఎంపీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, జూలై 29:** విజయవాడలోని ప్రముఖ పవిత్ర పుణ్యక్షేత్రం, ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం లోక్‌సభ సమావేశాల్లో 'నియమం-377' కింద ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. తిరుపతి తర్వాత రాష్ట్రంలో అత్యంత ఎక్కువ మంది భక్తులు సందర్శించే క్షేత్రం కనకదుర్గమ్మ ఆలయమేనని, సాధారణ రోజుల్లో 50 వేల మంది, ఉత్సవాల సమయంలో లక్షలాది మంది తరలివస్తుంటారని సభ దృష్టికి తెచ్చారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ శక్తిపీఠంలో పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా శాశ్వత మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**ప్రసాద్, పర్వతమాల పథకాల కింద భారీ నిధులు, రోప్‌వే మంజూరుకు డిమాండ్**

ఆలయ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని ఎంపీ శివనాథ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ప్రసాద్' (ప్రాణాూౠాాణ) పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించి బహుళ అంతస్తుల కార్ పార్కింగ్, విశాలమైన వెయిటింగ్ హాళ్లు, రద్దీని తగ్గించే రహదారుల విస్తరణ, పరిశుభ్రమైన తాగునీరు, డిజిటల్ సమాచార కేంద్రాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు కొండపైకి సులభంగా చేరుకోవడానికి 'పర్వతమాల' పథకం కింద ఆధునిక రోప్‌వే వ్యవస్థను ఆమోదించాలని కోరారు. దీనివల్ల కొండపైకి వెళ్లే రహదారుల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**వారణాసి, అయోధ్య తరహా అభివృద్ధి -- విజయవాడ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు**

అయోధ్య, వారణాసి తరహాలోనే ఇంద్రకీలాద్రిని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల విజయవాడ ఆర్థిక చిత్రాన్నే మార్చేయవచ్చని ఎంపీ తెలిపారు. ఆలయ అభివృద్ధి ద్వారా పర్యాటకం విస్తరించి స్థానిక హోటళ్లు, రవాణా, వ్యాపార రంగాలు పుంజుకోవడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. విజయవాడ ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్ వేదికగా వినిపించడం తన బాధ్యత అని, కనకదుర్గ ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు.



## అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బొండా ఉమా

**విజయవాడ, జూలై 29:** గురుపౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 33వ డివిజన్ సత్యనారాయణపురం, జి.ఎస్.రాజు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన శాఖాంబరి ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ బొండా ఉమామహేశ్వరరావు గారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువుల ఆశీస్సులు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని పేర్కొంటూ, శాఖాంబరీ దేవి దివ్య అనుగ్రహంతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ ఛైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసరావు, గార్లపాటి విజయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆల్‌టైమ్ రికార్డు లాభం

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్--జూన్) రూ. 1,075 కోట్ల ఆల్‌టైమ్ రికార్డు నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ1లో నమోదైన రూ. 463 కోట్లతో పోలిస్తే ఇది ఏకంగా 132.4 శాతం వృద్ధి చెందడం విశేషం. బ్యాంక్ మొత్తం కస్టమర్ వ్యాపారం 18.6% వృద్ధితో రూ.5,10,031 కోట్ల నుంచి రూ.6,04,776 కోట్లకు చేరింది.జారీ చేసిన రుణాలు, అడ్వాన్సులు 20.6 శాతం వృద్ధితో రూ. 3,05,370 కోట్లకు పెరిగాయి. ఆస్తుల నాణ్యత కూడా గణనీయంగా మెరుగైంది. స్థూల నిరర్థక ఆస్తులు 1.97 శాతం నుంచి 1.51

# పసిడి రుణాలు.. జిగేల్!




**ముంబై:** పసిడిపై రుణాలు తీసుకునేందుకు ఇటు ప్రజలు, ఇచ్చేందుకు అటు ఆర్థిక సంస్థలు పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం రుణ మార్కెట్ 2028 మార్చి నాటికి రూ. 30 లక్షల కోట్లకు చేరనుంది. 2026 మార్చి నెలలో రూ. 18 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ ఏకంగా 67 శాతం వృద్ధి చెందనుంది. ఈ క్రమంలో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నిర్వహణలోని ఆస్తుల పరిమాణం .. బ్యాంకులకు మించి 35 శాతం మేర వృద్ధి చెందనుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పోర్ట్‌ఫోలియోలో వాటి వాటా 22 శాతంగా ఉండగా 2028 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 23 శాతానికి చేరనుంది. అయితే గణనీయమైన పోటీ వల్ల వాటి రాబడులపై ఒత్తిడి నెలకొంటుందని, విస్తరణ ఒక మోస్తరు స్థాయికి పరిమితం కావొచ్చని ఇక్రా రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో 2026--27, 2027--28 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 35 శాతం మేర వృద్ధి చెందనుంది. బ్యాంకుల లోన్ బుక్ 30 శాతం మేర వృద్ధి చెందనుంది. 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి పూర్వం రెండేళ్ల పాటు పసిడి రుణాలు 38 శాతం పెరిగాయి. బ్యాంకులు 35 శాతం, ఎన్‌బీఎఫ్‌సీలు 54 శాతం వృద్ధి సాధించాయి.

**కొత్త సంస్థలతో జోష్..**

ఇటీవలి కాలంలో అన్‌సెక్యూర్డ్ రుణాల విభాగంలో ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో పసిడిలాంటి సెక్యూర్డ్ రుణాల విభాగం మరింతగా వృద్ధి చెందనుందని ఇక్రా సెక్టార్ హెడ్ ఆర్ శ్రీనివాసన్ తెలిపారు. కొత్త సంస్థలు రావడం, ఇప్పటికే ఉన్నవి శాఖల నెట్‌వర్క్‌ను విస్తరిస్తుండటం ఇందుకు దోహదపడుతుందని వివరించారు. రిపోర్ట్‌లో మరిన్ని విశేషాలు.. ఎన్‌బీఎఫ్‌సీలు ప్రధానంగా వ్యాపారం లేదా సొంత వినియోగ అవసరాల కోసం ఉద్దేశించిన రిటైల్ పసిడి రుణాలపై (జీఎల్) ఫోకస్ చేస్తున్నాయి. 2026 మార్చి ఆఖరు నాటికి వాటి ఏయూఎం రూ. 4 లక్షల కోట్లుగా ఉంది. బ్యాంకుల్లో రిటైల్ గల్డ్ లోన్లు 2025--26లో దాదాపు రెట్టింపయ్యాయి. వ్యవసాయం, ఇతరత్రా అవసరాల కోసం ఉద్దేశించిన జీఎల్‌లు సుమారు 25 శాతం పెరిగాయి. కొత్త రుణాలకు డిమాండ్ ఏర్పడటంతో పాటు కొన్ని రుణాలను వ్యవసాయం నుంచి రిటైల్ రుణాల కేటగిరీలోకి మార్చడం కూడా ఇందుకు కారణం. తనఖా ఉంచిన పసిడి పరిమాణం పెద్దగా పెరగకపోయినప్పటికీ పసిడి ధరలు అధిక స్థాయిలో ఉండటమనేది గోల్డ్ లోన్స్ మార్కెట్ వృద్ధిలో చాలా కీలక పాత్ర పోషిస్తోంది. 2021--22 నుంచి 2025--26 మధ్య కాలంలో పెద్ద సంస్థల లోన్ బుక్ 24 % పెరగ్గా, తనఖా ఉంచిన పసిడి ఆభరణాల టన్నేజీ ఒక మోస్తరుగా 3--4% వృద్ధి చెందింది.


# 26వ డివిజన్‌లో వైభవంగా "ఇంటింటికి తెలుగుదేశం'





## హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే బొండా ఉమ

**విజయవాడ, జూలై 29:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే సామాజిక పింఛన్‌ను రూ.4,000కు పెంచామని, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నామని తెలిపారు. అంతేకాకుండా, మహిళల ఆర్థిక సాధికారత కోసం త్వరలోనే "స్త్రీనిధి" పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళకు ఏడాదికి రూ.18,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ గత రెండేళ్లలో రూ.550 కోట్ల విలువైన పనులు చేపట్టామని, అందులో రూ.350 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పాఠశాల భవనాల నిర్మాణాలు వేగంగా జరుగు తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి రూ.100 కోట్లతో రాజ చీశీ.316 ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేశామని, అలాగే సింగ్‌నగర్ వాంబే కాలనీలో రూ.85 కోట్లతో 43 మీణ రా వాటర్ ఫిల్ట్రేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని 21 డివిజన్లకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ బచ్చుల బోస్, డివిజన్ అధ్యక్షులు తోట పాండు, వల్లభనేని సతీష్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# సినిమాగా 'శ్రీమద్ భాగవతం'

ప్రముఖ పౌరాణిక ధారావాహిక 'రామాయణం' సృష్టికర్త రామానంద సాగర్ కుటుంబానికి చెందిన సంస్థ నుంచి మరో భారీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. గురుపౌర్ణమి (వ్యాస పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని, సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 'శ్రీమద్ భాగవతం' పేరుతో ఏడు భాగాల సినిమాటిక్ ఫ్రాంచైజీని ప్రకటించింది. భాగవత మహాపురాణం ఆధారంగా, అత్యంత ప్రామాణిక కథనంతో ఈ చిత్రాలను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఏడు రోజుల భాగవత సప్తాహ పారాయణం సంప్రదాయం స్ఫూర్తితో ఈ చిత్రాలను ఏడు భాగాలుగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి 'సప్త' అని నామకరణం చేశారు. ఈ ఫ్రాంచైజీలోని ఏడు భాగాలు ఒకదానికొకటి అనుసంధానమై సాగనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నటీనటులు, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను చిత్రబృందం త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.





# అభిమానికి ట్యూమర్.. వరుణ్ తేజ్ అండ

ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. ట్యూమర్‌తో బాధపడుతున్న అనంతపురం జిల్లాకు చెందిన ఓ అభిమానికి అండగా నిలిచి, తన మానవత్వాన్ని ప్రదర్శించారు. బాధితుడిని హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించడమే కాకుండా, చికిత్సకు అయ్యే పూర్తి వ్యయాన్ని తానే స్వయంగా భరించి భరోసానిచ్చారు. అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ కొంతకాలంగా ట్యూమర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరుణ్ తేజ్ తక్షణమే స్పందించారు. తన తల్లి పద్మజ సహకారంతో సురేష్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందేలా అక్కడి వైద్యులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో సురేష్ పాటిల్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. చికిత్స సమయంలో బాధితుడి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను వరుణ్ తేజ్ కల్పించారు. సురేష్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అండగా నిలిచారు.

# వెంకటేశ్ కూతురిగా యువినా పార్థవి

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (ఏకే 47). తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. చిత్ర యూనిట్ తాజాగా ఈ సినిమాలోని మరో ముఖ్య పాత్రను పరిచయం చేస్తూ ఒక చిన్న వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేష్ కూతురు "సంపూర్ణ" పాత్రలో నటి యువినా పార్థవిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ కొత్త గ్లింప్స్‌లో, చిట్టిబాబు పాత్రలో ఉన్న వెంకటేశ్, రఘుబాబుతో ఇంటి విషయాల గురించి మాట్లాడుతుండగా, వారి కూతురు సంపూర్ణ (యువినా పార్థవి) ఎంతో ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వస్తుంది. "నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను" అని తండ్రితో చెబుతుంది. దానికి చిట్టిబాబు చిరాకు పడుతూ, "ఈసారి కార్ డ్రైవర్‌తోనా, మెకానిక్‌తోనా?" అని అడగటంతో ఈ వీడియోలో చూడొచ్చు. తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఈ ఫన్నీ సంభాషణ, సినిమా ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందన్న సంకేతాలను ఇస్తోంది. ఈ గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. చిత్రబృందం వినూత్నంగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెంకటేశ్ ను చిట్టిబాబుగా, ఆయన భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టిని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూతురి పాత్రను కూడా పరిచయం చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# మేనమామే బలవంతం చేశాడు

బుల్లితెర నటి, 'బాలికా వధు 2' సీరియల్ ఫేం శివాంగి జోషి చిన్నప్పుడు తనకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి వివరిస్తూ ఎమోషనల్ అయింది. తాజాగా 'లాకప్ 2' రియాల్టీ షోలో పాల్గొన్న ఆమె.. చిన్నప్పుడు సొంత మేనమామనే తనతో అసభ్యంగా ప్రవర్తించారని తెలిపారు. 'మా అమ్మకు సోదరుడైన ఓ వ్యక్తిని నేను చాలా నమ్మేదాన్ని. ముద్దుగా మామాజీ అని పిలిచేదాన్ని. నన్ను రోజు స్కూల్ నుంచి తీసుకొచ్చేవాడు. మా అమ్మ అతన్ని ఎంతగానో నమ్మేది. అదే ఆసరాగా చేసుకొని నాతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. నేను సినిమాల్లోకి వెళ్లాలంటే ముందుగా డ్రైవింగ్ నేర్చుకోవాలని చెబుతూ..ఒళ్లో కూర్చోబెట్టుకొని ఏదోదో చెప్పేవాడు. ఆయన ఏం చెబుతున్నాడో.. ఆయన ఉద్దేశాలు ఏంటో అర్థం కాలేదు. కానీ నాకు నచ్చలేదు. నేను డ్రైవింగ్ నేర్చుకోనని చెప్పి.. పక్కకు వచ్చేశా. ఓ రోజు మా అమ్మనాన్నలు బయటకు వెళ్లారని తెలుసుకొని.. ఇంట్లోకి వచ్చాడు. హీరోయిన్‌వి కావాలంటే రకరకాల సీన్లలో నటించాలంటూ.. నా నుదుటిపై, చెంపలపై ముద్దు పెట్టాడు. నా పెదాలపై ముద్దు పెట్టేందుకు ప్రయత్నించగా..తోసేశాను. దీంతో అతనికి కోపం వచ్చి నన్ను కింద పడేశాడు. అదృష్టంకొద్ది అప్పుడే అమ్మనాన్నలు ఇంట్లోకి వచ్చారు. నా అరుపులు విని గదిలోకి వచ్చి చూశారు. ఏం జరిగిందో తెలుసకొని..అతన్ని కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేశారు' అని చెబుతూ శివాంగీ ఎమోషనల్ అయింది.



# నీ వయసులో నాకు 2 జాతీయ పురస్కారాలు వచ్చాయి

కాక్రోచ్ పార్టీ ప్రతినిధిపై కంగన ఘాటు విమర్శలు


బీజేపీ ఎంపీ, సినీనటి కంగనా రనౌత్ మరోసారి 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)పై తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి ఆ పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆయనపై విమర్శల వర్షం కురిపించారు. సౌరవ్ దాస్ తనను తాను విద్యార్థిగా చెప్పుకోవడాన్ని ప్రశ్నిస్తూ.. ఆయనకు ఎలాంటి నైపుణ్యం లేదని వ్యాఖ్యానించారు. అదే సమయంలో తన రాజకీయ, సినీ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ తాను సాధించిన విజయాలను గుర్తు చేశారు. ఏఎన్ఐ ఇంటర్వ్యూకు సంబంధించిన సౌరవ్ దాస్ స్క్రీన్‌షాట్‌ను పంచుకున్న కంగనా "గూగుల్‌లో వెతికితే ఆయన వయసు 28 ఏళ్లని తెలిసింది. ఆ వయసులో కూడా తనను విద్యార్థిగా ఎలా చెప్పుకుంటున్నారో అర్థం కావడం లేదు. నేను రెండేళ్లుగా రాజకీయాల్లో ఉన్నా, 20 ఏళ్లుగా ప్రజాజీవితంలోనే ఉన్నాను. ఆయన వయసులోనే నాకు రెండు జాతీయ పురస్కారాలు వచ్చాయి. ప్రస్తుతం ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే దర్శకురాలు, నటి, నిర్మాత, కథా రచయిత్రి, పారిశ్రామికవేత్తగా కూడా పని చేస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతటితో ఆగని కంగనా.. సౌరవ్ దాస్‌పై మరింత ఘాటుగా స్పందించారు. "నీలాంటి పూర్తిగా పనిలేని, నిరుద్యోగ వ్యక్తికి విజయవంతమైన జీవితం అంటే ఏంటో అర్థం కాదు. నీ సమస్యలు వ్యక్తిగతమైనవి. నువ్వు విద్యార్థివి కాదు. పూర్తిగా పనిలేనివాడివి. ముందుగా ఏదైనా నైపుణ్యం నేర్చుకోవడం ప్రారంభించు. అదే నీకు మంచి ఆరంభం అవుతుంది" అని వ్యాఖ్యానించారు. నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలపై సీజేపీ చేపట్టిన ఆందోళన ఇటీవల కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసింది. బాధిత కుటుంబాలకు పరిహారం, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ వంటి పలు డిమాండ్లను కేంద్రం అంగీకరించిన తర్వాత నెలరోజులుగా కొనసాగిన ఉద్యమాన్ని సీజేపీ విరమించింది. ఈ ఉద్యమంపై కంగనా గతంలో కూడా విమర్శలు చేశారు.

# కామన్వెల్త్‌లో సర్వేశ్ చరిత్ర..

## హైజంప్‌లో తొలి భారతీయుడిగా రజతం

గ్లాస్‌గో, జూలై 29

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ చరిత్రలో మరో స్వర్ణ అధ్యాయం నమోదైంది. పురుషుల హైజంప్ ఫైనల్లో 31 ఏళ్ల భారత అథ్లెట్ సర్వేశ్ కుషారే 2.25 మీటర్ల ఎత్తును అధిగమించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో హైజంప్ విభాగంలో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా సర్వేశ్ చరిత్ర సృష్టించాడు. పురుషుల హైజంప్ ఫైనల్లో భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు బరిలోకి దిగగా, మిగతా ఇద్దరూ ముందుగానే పోటీ నుంచి నిష్క్రమించారు. అయితే సర్వేశ్ మాత్రం చివరి వరకు పోరాడి భారతదేశానికి విలువైన పతకాన్ని అందించాడు. తొలి ప్రయత్నంలోనే 2.20 మీటర్లతో సహా మొదటి నాలుగు ఎత్తులను సునాయాసంగా అధిగమించి పతక రేసులో ముందంజలో నిలిచాడు. ఆ తర్వాత 2.25 మీటర్ల ఎత్తును తొలి రెండు ప్రయత్నాల్లో అధిగమించలేక వెనుకబడ్డాడు. అయినప్పటికీ మూడో ప్రయత్నంలో ఒత్తిడిని జయించి విజయవంతంగా ఆ ఎత్తును దాటడంతో భారత పతకం ఖాయమైంది. స్వర్ణ పతకం సాధించిన జమైకా అథ్లెట్‌తో కలిసి సర్వేశ్ కూడా 2.28 మీటర్ల ఎత్తును అధిగమించేందుకు చేసిన మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యాడు. అయితే కౌంట్‌బ్యాక్ నిబంధన ప్రకారం సర్వేశ్‌కు రజత పతకం లభించింది. ఇదిలా ఉండగా, 2025లో టోక్యోలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 2.28 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన సర్వేశ్, ఇప్పుడు కామన్వెల్త్ గేమ్స్‌లో చారిత్రాత్మక రజత పతకంతో భారత అథ్లెటిక్స్‌కు మరో గర్వకారణంగా నిలిచాడు.






## 10 వేల మీటర్లలో చరిత్ర సృష్టించిన గుల్వీర్

### కామన్వెల్త్‌లో తొలి భారతీయుడిగా రజతం

గ్లాస్‌గో, జూలై 29

కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ చరిత్ర సృష్టించాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో పతకం సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా నిలిచాడు. ఈ విభాగంలో గుల్వీర్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ రికార్డు హోల్డర్ అయిన గుల్వీర్.. కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెటిక్స్‌కు రెండో రజత పతకాన్ని అందించాడు. ఇదే మెగా ఈవెంట్‌లో పురుషుల హైజంప్ విభాగంలో సర్వేశ్ కుషేర్ కూడా రజత పతకం సాధించాడు. గుల్వీర్ సింగ్ 27 నిమిషాల 49.78 సెకన్లలో 10 వేల మీటర్ల పరుగును పూర్తి చేశాడు. ఆస్ట్రేలియాకు చెందిన కై రాబిన్‌సన్ 27 నిమిషాల 48.93 సెకన్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, గుల్వీర్ స్వల్ప తేడాతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. గ్లాస్‌గోలోని స్కాట్‌స్టోన్ స్టేడియంలో భారీ వర్షం మధ్య జరిగిన ఈ పోటీలో గుల్వీర్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. ప్రారంభం నుంచే ముందంజలో కొనసాగిన అతడు చివరి ల్యాప్‌ల్లో వేగం పెంచి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. పతకం గెలవడం ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుందని, వర్షం వంటి ప్రతికూల పరిస్థితులు విజయంతో మరిచిపోతామని గుల్వీర్ తెలిపాడు. అంతా భగవంతుడి దయేనని పేర్కొన్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని అత్రౌలీకి చెందిన 28 ఏళ్ల గుల్వీర్ ప్రస్తుతం భారత సైన్యంలో సేవలందిస్తున్నాడు.

# భారత్‌కు మరో పతకం

### ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో సోనం--హిమాన్షుకు కాంస్యం

హాంగ్‌జౌ, జూలై 29

**చైనాలోని హాంగ్‌జౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు మరోసారి సత్తా చాటారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సోనం ఉత్తమ్ మస్కర్--హిమాన్షు ధిల్లాన్ జోడీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది నాలుగో పతకం కావడం విశేషం.**



క్వాలిఫికేషన్ రౌండ్‌లో సోనం (317.2), హిమాన్షు (317.4) కలిసి మొత్తం 634.6 పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించారు. మరో భారత జోడీ ఎలావెనిల్ వలరివన్ (316.8), పార్థ్ రాకేష్ మానే (317.4) 634.2 పాయింట్లతో ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఫైనల్‌లో సోనం--హిమాన్షు జోడీ 441.2 పాయింట్లు సాధించి చైనా-1, చైనా-2 జట్ల తర్వాత మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. మరో భారత జోడీ ఎలావెనిల్--పార్థ్ 378.8 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. విజయానంతరం సోనం మాట్లాడుతూ, ఈ పోటీ ఎంతో కఠినంగా సాగిందని, ఇక్కడ పొందిన అనుభవం రానున్న ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని తెలిపింది. హర్యానాకు చెందిన 20 ఏళ్ల హిమాన్షు ధిల్లాన్ మాట్లాడుతూ, తన తొలి సీనియర్ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ ఫైనల్‌లోనే పతకం సాధించడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని, కోచ్ మార్గదర్శకత్వం తన విజయానికి కీలకమైందని పేర్కొన్నాడు.

# గిల్‌కు వన్డేల్లో నంబర్-1 ర్యాంక్

### టీ20ల్లో వైభవ్ సూర్యవంశీ భారీ జంప్

దుబాయ్ , జులై 29




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. వన్డే బ్యాటర్ల జాబితాలో భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రపంచ నంబర్-1 బ్యాటర్‌గా అవతరించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్ 801 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 794 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ 767 పాయింట్లతో మూడో, రోహిత్ శర్మ 758 పాయింట్లతో నాలుగో స్థానాల్లో కొనసాగుతున్నారు.



# బ్రెజిల్‌కు నేమార్ వీడ్కోలు

### 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు

సావో పాలో, జూలై 29

బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం, ఆ దేశ జాతీయ జట్టు ఆల్‌టైమ్ టాప్ స్కోరర్ నేమార్ జూనియర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల నేమార్ 16 ఏళ్లకు పైగా సాగిన తన జాతీయ జట్టు ప్రస్థానాన్ని ముగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లో నార్వేతో జరిగిన రౌండ్ ఆఫ్--16 మ్యాచ్‌నే బ్రెజిల్ తరపున తన చివరి మ్యాచ్‌గా పేర్కొన్నాడు. కోపా సుడాఅమెరికానా టోర్నమెంట్‌లో శాంటోస్ తరపున యూనివర్సిడాడ్ సెంట్రల్‌పై 4-2 తేడాతో విజయం సాధించిన అనంతరం మీడియాతో మాట్లాడిన నేమార్ ఈ విషయాన్ని వెల్లడించాడు. జాతీయ జట్టుతో తన ప్రయాణం ముగిసిందని, ఎలాంటి పశ్చాత్తాపం లేకుండానే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశాడు. “బ్రెజిల్ జట్టుతో నా ప్రయాణం ముగిసింది. దేశం కోసం నా శక్తినంతా అర్పించాను.

# వేళ్లతో శబ్దం చేసి బ్యాట్స్‌మన్‌ను ఔట్

### ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో వింత మోసం

లండన్, జులై 29

ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో వెలుగులోకి వచ్చిన ఓ వింత మోసం క్రీడా ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. బ్యాట్‌కు బంతి తగిలినట్లు భ్రమింపజేసేందుకు ఓ ఫీల్డర్ తన వేళ్లతో ‘క్లిక్’ శబ్దం చేసి అంపైర్‌ను తప్పుదోవ పట్టించిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో లీగ్ యాజమాన్యం అధికారిక విచారణకు ఆదేశించింది. నార్త్ యార్క్‌షైర్ అండ్ సౌత్ దర్హామ్ క్రికెట్ లీగ్‌లో సాల్ట్‌బర్న్, మిడిల్స్‌బ్రో సెకండ్ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సాల్ట్‌బర్న్ జట్టుకు చెందిన ఫీల్డర్ బ్రియాన్ డెవిన్, బంతి బ్యాట్స్‌మన్‌ను దాటే సమయంలో తన వేళ్లతో ‘క్లిక్’ శబ్దం చేసి, అది బ్యాట్ ఎడ్జ్ శబ్దమని అంపైర్‌ను నమ్మించే ప్రయత్నం చేశాడు. దీంతో అంపైర్ బ్యాట్స్‌మన్‌ను కీపర్ క్యాచ్‌గా ఔట్ ప్రకటించినట్లు వీడియోలో కనిపించింది. ఈ ఘటన ఒక్క మ్యాచ్‌కే పరిమితం కాలేదని మిడిల్స్‌బ్రో జట్టు కెప్టెన్ ఆరోపించాడు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు పునరావృతమయ్యాయని, ఒకే మ్యాచ్‌లో ముగ్గురు బ్యాటర్లు తాము బంతిని తాకలేదని చెప్పినా ఔట్‌గా వెనుదిరగాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఇలాంటి చర్యలు యువ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశాడు. వివాదం ముదరడంతో లీగ్ నిర్వాహకులు ఘటనపై అధికారిక ఫిర్యాదు స్వీకరించి విచారణ ప్రారంభించారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రియాన్ డెవిన్‌కు నెటిజన్లు వ్యంగ్యంగా ‘క్లిక్కీ పాంటింగ్’ అనే ముద్దుపేరు పెట్టారు. ప్రముఖ వ్యాఖ్యాత పియర్స్ మోర్గాన్ కూడా స్పందిస్తూ, “ఇతను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద చీటర్” అంటూ విమర్శించారు. ఈ వివాదం నేపథ్యంలో బ్రియాన్ డెవిన్‌కు స్థానికంగా స్పాన్సర్‌గా ఉన్న ‘స్పైసెస్’ ఇండియన్ రెస్టారెంట్ కూడా తమ మద్దతును ఉపసంహరించుకున్నట్లు సమాచారం.






# ఐపీఎల్ బ్రాండ్ విలువలో ఆర్సీబీ అగ్రస్థానం

### రూ.1.97 లక్షల కోట్లకు చేరిన లీగ్ విలువ

ముంబై, జూలై 29

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా మరోసారి తన సత్తా చాటుకుంది. హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వాల్యుయేషన్ స్టడీ ప్రకారం లీగ్ మొత్తం వ్యాపార విలువ రూ.1,97,024.68 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం వృద్ధి నమోదు చేసింది. అదే సమయంలో ఐపీఎల్ బ్రాండ్ విలువ కూడా రూ.41,106 కోట్లకు చేరి 10.3 శాతం పెరిగింది. బ్రాండ్ విలువ పరంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అగ్రస్థానంలో నిలిచింది. సుమారు రూ.2,987 కోట్ల బ్రాండ్ విలువతో రూ.3 వేల కోట్ల మార్కుకు చేరువైన తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ముంబై ఇండియన్స్ రూ.2,528 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.2,346 కోట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ.2,336 కోట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1,608 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ రూ.1,541 కోట్లతో ఆరో స్థానంలో ఉండగా, పంజాబ్ కింగ్స్ రూ.1,513 కోట్లతో ఏడో స్థానంలో నిలిచింది. గుజరాత్ టైటాన్స్ రూ.1,503 కోట్లతో ఎనిమిదో స్థానం దక్కించుకోగా, ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1,494 కోట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. లక్నో సూపర్ జెయింట్స్ రూ.1,168 కోట్లతో పదో స్థానంలో కొనసాగింది. 2026లో ఫ్రాంచైజీల యాజమాన్యంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌తో కూడిన కన్సార్టియం ఆర్సీబీని సుమారు రూ.17,042 కోట్ల విలువకు కొనుగోలు చేసింది. మరోవైపు మిట్టల్ కుటుంబం, అదర్ పూనావాలా కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను సుమారు రూ.15,797 కోట్ల విలువతో సొంతం చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ వ్యాప్తి, ప్రసార హక్కుల విలువ పెరగడం, అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆసక్తి, ఫ్రాంచైజీల వాణిజ్య విస్తరణ వంటి అంశాలు ఐపీఎల్ బ్రాండ్ విలువను మరింత బలోపేతం చేస్తున్నాయని నివేదిక పేర్కొంది. దీంతో ప్రపంచ క్రీడా వ్యాపార రంగంలో ఐపీఎల్ మరింత ప్రభావవంతమైన లీగ్‌గా ఎదుగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467